సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 21 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

పర్యాటక అందాలకు విద్యా కమిషనర్ ఫిదా



తాటిగుడ అందాలను తిలకిస్తున్న, ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్

అనంతగిరి: మన్యం పర్యాటక అందాలను ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్ కుటుంబ సమేతంగా తిలకించారు. మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రాగుహలు, తాటిగుడ జలపాతాన్ని ఆదివారం వారు సందర్శించి ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. అనంతరం అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో ఎడ్యుకేషన్ కమిషనర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన వెంట డీఈవో సలీంబాషా, తదితరులు ఉన్నారు.

చింతూరులో పులి పంజా

వారం వ్యవధిలో ఐదు పశువుల మృతి



గ్రామస్తులు తీసిన పులి పాదముద్ర ఫొటో

చింతూరు: మండలంలోని పెదశీతనపల్లి, కన్నాయిగూడెం నడుమ అటవీ ప్రాంతంలో పులి సంచారంతో ఈ ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఐదు పశువులను పులి హతమార్చినట్లు పెదశీతనపల్లి గ్రామస్తులు ఆదివారం తెలిపారు. మడకం కన్నారావు, శ్యామల నర్సింహారావు, సోడె కన్నయ్య, మడివి కన్నయ్యలకు చెందిన ఐదు పశువులను చంపేయడంతో ఆర్థికంగా నష్టపోయామని వాపోయారు. తన బండెద్దులు మేత నిమిత్తం అడవికి వెళ్లగా, పులిదాడి చేయడంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మరో ఎద్దుకు చికిత్స అందించినప్పటికీ మరణించిందని రైతు నర్సింహారావు కన్నీటి పర్యంతమయ్యాడు. పులి సంచరిస్తుండటంతో రాత్రుళ్లు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, అటవీ అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్



సాక్షి, పాడేరు: వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ బాణావతు సాయికుమార్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాడేరు నియోజకవర్గానికి చెందిన డాక్టర్ సాయికుమార్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సాయికుమార్ పాడేరు జిల్లా ఆస్పత్రిలో కాంటాక్టు పద్ధతిపై మత్తు వైద్యునిపుణుడిగా పనిచేస్తున్నారు.

విషాద మలుపు

- పాడేరు ఘాట్‌రోడ్డులో ఘోర ప్రమాదం
- ఇటీవల గాలులకు ఒరిగిన చెట్టుకొమ్మ
- దానిని తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- ఐదు పల్టీలు కొట్టి.. 100 అడుగుల లోతులోకి..
- అక్కడ చెట్టు అడ్డడంతో నిలిచిన బస్సు
- లేదంటే పెను విషాదమే..
- సకాలంలో స్పందించిన అధికారులు
- హుటాహుటిన ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం





క్షతగాత్రులను పరామర్శించేందుకు పాడేరు జిల్లా ఆస్పత్రికి వచ్చిన మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, పాడేరు/పాడేరు రూరల్: జీవితం ఏ క్షణాన ఏ మలుపు తిరుగుతుందో ఎవ్వరూ ఊహించలేం. ఎన్నో ఆశలు.. ప్రణాళికలతో ముందుకు వెళ్తాం.. కానీ, ఒక్క సంఘటన జీవితాన్ని మలుపు తిప్పుతుంది. అటువంటి విషాద ఘటనే ఆదివారం పాడేరు ఘాట్‌రోడ్డులో చోటు చేసుకుంది. ఓ బస్సులోని ప్రయాణికుల జీవితాలను ఘాట్‌రోడ్డులోని ఓ మలుపు మార్చేసింది. ఘాట్‌రోడ్డులో అదుపు తప్పి బస్సు లోయలోకి పడిపోయిన ఘోర ప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకోగా 28మందిని క్షతగాత్రులుగా మిగిల్చింది. అంతటి విషాదంలోను నెలల శిశువు ఒకరు సురక్షితంగా బయటపడటం విశేషం. కొద్ది రోజుల కిందట వీచిన గాలికి వాలిన చెట్టు కొమ్మను తప్పించి ముందుకెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించగా.. ఇంతలో ఎదురుగా బైక్ వస్తోంది. దానిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి.. లోయలోకి జారిపోయింది. ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే.. ఒకటి కాదు.. రెండు కాదు.. 5 పల్టీలు కొట్టి 100 అడుగుల లోతులోకి వెళ్లిపోయింది. ఇదే చివరి ప్రయాణమని అంతా భావించారు. కానీ.. లోయలో ఉన్న ఓ చెట్టు అడ్డడంతో బస్సు నిలిచిపోయింది. ఈ ఘోర ప్రమాదం.. ఇద్దరి ప్రాణాలను గాల్లో కలిపేసింది. ఒరిగిన చెట్టు కొమ్మ.. విషాదానికి కారణమైతే.. మరో చెట్టు 28 మంది ప్రాణాలను కాపాడింది. డ్రైవర్ సహా మొత్తం 34 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖలో బయలుదేరిన బస్సు పాడేరు ఘాట్ రోడ్డులోని వ్యూ పాయింట్ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదానికి గురైంది. ఇద్దరు ప్రయాణికులు పల్టీల ధాటికి ప్రమాద స్థలిలోనే మృతి చెందారు. ఒళ్లంతా గాయాలతో క్షతగాత్రుల హాహాకారాలతో లోయ ప్రతిధ్వనించింది.

కళ్ల ముందే బస్సు లోయలోకి..

మేము మైదాన ప్రాంతానికి కారులో వెళుతున్నాం. అదే సమయంలో మా కళ్ల ముందే ఆర్టీసీ బస్సు లోయలోకి దూసుకుపోయింది. ప్రయాణికుల ఆర్తనాదాలు, కేకలు విని వెంటనే లోయలోకి దిగేందుకు సిద్ధమయ్యాం. ఇదే దారిలో వస్తున్న కొంతమంది వాహన చోదకులు సహాయ పడ్డారు. లోయలోకి దిగి తీవ్ర గాయాల పాలైన ప్రయాణికులను రోడ్డుకు మోసుకువచ్చాం. పాడేరు నుంచి అంబులెన్స్‌లు, 108 వాహనాలు రావడంతో గాయపడిన వారందరినీ పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించాం.

– ప్రత్యక్ష సాక్షులు గద్దంగి రమేష్‌బాబు, పూజారి ఆనంద్, శేషగిరి



ఘాట్‌రోడ్డులో గుమిగూడిన జనం

ఆ క్షణంలో నా బిడ్డను గట్టిగా పట్టుకున్నా..



విశాఖపట్నం నుంచి నాలుగు నెలల బిడ్డతో పాడేరుకు బయలుదేరాను. మరో అరగంటలో పాడేరులో దిగిపోతానని అనుకుంటున్న సమయంలో క్షణాల్లో బస్సు లోయలోకి దూసుకుపోవడంతో భయం వేసింది. నా బిడ్డను గట్టిగా పట్టుకుని అలాగే ఉండిపోయాను. నా తలకు గాయమైంది. నా బిడ్డకు ఏమీ కాలేదు. సంతోషంగా ఉంది.

– తాంగుల జ్యోతి, తూటంగి, డుంబ్రిగుడ మండలం

ప్రాణం పోయిందనుకున్నా..



అనంతపురంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొంది సొంతూరుకు వచ్చేందుకు చోడవరంలో బస్సెక్కాను. ఘాట్‌లో మలుపు వద్ద ఒక్కసారిగా బస్సు పక్కకు రావడంతో కంగారు పడ్డాను. చూస్తుండగానే బస్సు నేరుగా లోయలోకి దూసుకుపోవడంతో ప్రాణం పోయిందనుకున్నాను. ఇంట్లో భార్యాపిల్లలను ఆ క్షణంలో గుర్తు చేసుకున్నాను. చెట్టు అడ్డంగా ఉండటంతో బస్సు నిలిచింది. గాయంతో ప్రమాదం నుంచి బయటపడ్డాను.

– బంటు రఘునాథ్, ఒంటిపాక గ్రామం, హుకుంపేట మండలం

చెట్టు లేకపోతే ఘోరం జరిగిపోయేది

ఈ ప్రమాదాన్ని చూసిన స్థానికులు.. బస్సులో ఉన్న వారెవ్వరూ ప్రాణాలతో బయట పడరేమోనని భయాందోళనకు గురయ్యారు. ఇంతలో.. ఒక చెట్టు ఆ బస్సుని ఆపేసింది. దీంతో.. అంతా ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే.. మరో 50 అడుగుల కింద ఉన్న దిగువ ఘాట్‌రోడ్డుపై బస్సు పడే ప్రమాదముంది. ఆ రోడ్డుకు బలంగా ఢీకొడితే.. మరింత ఘోరం జరిగేది. బస్సు అక్కడితో ఆగే అవకాశం లేకపోతే.. దిగువ ఉన్న మరో ఘాట్‌లోకి జారే ప్రమాదమూ లేకపోలేదు. చెట్టు బస్సును ఆపడం వల్ల.. మిగిలిన ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..

ప్రమాదం గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం తీరు గురించి మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌లను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వారి కుటుంబాలకు ధైర్యం చెప్పాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం ఆదేశాల మేరకు హుటాహుటిన బయలుదేరి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం తీరును తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు.

క్షతగాత్రులకు పరామర్శ



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి

సాక్షి, విశాఖపట్నం: పాడేరు ఘాట్ రోడ్ ప్రమాదంలో గాయాలపాలై మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఆదివారం రాత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్టీ సెల్ మెడికల్ ఆఫీసర్ మౌళి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నీలిమాలతో ప్రత్యేకంగా చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఘాట్‌రోడ్డులో ప్రమాద ఘట్టం (ఊహా చిత్రం)

సహాయక చర్యలు ముమ్మరం

ప్రమాద విషయం తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రమాద స్థలికి హుటాహుటిన చేరుకున్నారు. ప్రమాదం జరిగిన అరగంట వ్యవధిలోనే సహాయక చర్యలు ముమ్మరం చేశారు. లోయ పైనుంచి కొందరు.. కింద నుంచి కొందరు ప్రమాదానికి గురైన బస్సు వద్దకు చేరుకుని అతికష్టం మీద క్షతగాత్రులను ఘాట్‌రోడ్డు వద్దకు తీసుకొచ్చారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సకాలంలో వారిని ఆస్పత్రికి తరలించారు. ఐదుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారంతా పాడేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అమ్మో.. ఘాట్‌రోడ్డు

- పాడేరు ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు
- హెయిర్‌పిన్‌బెండ్ మలుపు ప్రమాదాలకు పిలుపు



2021లో హెయిర్‌పిన్‌బెండ్ 5 మలుపు వద్ద బ్రేక్‌ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకుపోయిన ప్రైవేటు బస్సు (ఫైల్)

అనంతగిరి: మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లాలంటే దట్టమైన అడవి మీదుగా ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయాలి. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి 23 కిలోమీటర్లు, అనంతగిరి నుంచి కాశీపట్నం వరకు 25 కిలో మీటర్ల మేర ఘాట్‌రోడ్డు విస్తరించి ఉంది. ఏజెన్సీ ప్రాంతానికి కీలకమైన ఘాట్ రోడ్డులో వరస ప్రమాదాలతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. పాడేరు ఘాట్‌రోడ్డులో కోమాలమ్మ, పనుకు, వ్యూపాయింట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్రమాదకరమైన హెయిర్ పిన్‌బెండ్ మలుపులు ఉన్నాయి.

పాడేరు ఘాట్‌రోడ్డులో..

- 2019 జూలై 8వ తేదీ అర్ధరాత్రి పాడేరు ఘాట్ రోడ్డులోని వంట్లమామిడి గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ బస్సు బ్రేక్ విఫలం కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, 35 మంది గాయపడ్డారు. మృతులు, గాయపడిన ప్రయాణికులందరిదీ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఒడిశాలోని మజ్జి గౌరమ్మను దర్శించుకుని, తిరిగి కాకినాడకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.
- 2021 నవంబర్ 13న వంతాపల్లి చెక్‌పోస్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 ఏళ్ల వివాహిత మృతి చెందగా.. ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి.
- 2023 ఏప్రిల్ 26 రాత్రి పాడేరు– కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్ద ఓ కారు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. అనంతరం లోయలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో గాయపడిన మహేశ్వరితో పాటు కారు డ్రైవర్ కంద్రాపు ఉమామహేశ్వరరెడ్డి మృతి చెందారు. పాడేరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహేశ్వరి భర్త సుబ్బారావు మరణించారు. భార్యాభర్తలిది విశాఖలోని సీతంపేట.
- 2023 ఏప్రిల్‌లో ఘాట్ రోడ్డు ఏసుక్రీస్తు విగ్రహం సమీపంలో మలుపు వద్ద కారు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు నలుగురు మృతిచెందారు. మృతులందరిదీ ముంచంగిపుట్టు మండలం కిలగాడ.
- 2023 జూలై 11న పాడేరు ఘాట్‌రోడ్డులోని ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పరవాడ మండలం ముచ్చలమ్మపాలేనికి చెందిన సతీష్ మృతి చెందాడు. మోదకొండమ్మను దర్శించుకుని, తిరిగి ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

అనంతగిరి ఘాట్‌రోడ్డులో..

- 2019లో హెయిర్ పిన్‌బెండ్ 2 మలుపు వద్ద మైదాన ప్రాంతానికి వెళుతున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 25 మంది వరకు పర్యాటకులు గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగింది.
- 2021లో హెయిర్ పిన్‌బెండ్ 5 మలుపు వద్ద రాత్రి 8 గంటల సమయంలోని 80 అడుగుల లోయలోకి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. 22 మందికి గాయాలయ్యాయి. వీరంతా హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులు.

బెడిసికొట్టిన మావోల వ్యూహం

- దండకారణ్యంలో భారీగా బూబీ ట్రాప్‌లు
- పోలీసులే లక్ష్యంగా పాతర
- ఎన్నికల వేళ విధ్వంసానికి యత్నం
- స్వాధీనం చేసుకున్న ఆంధ్రా పోలీసులు



అటవీప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బూబీ ట్రాప్‌లు

చింతూరు: ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల వ్యూహం బెడిసికొట్టింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులే లక్ష్యంగా ఈ ప్రాంతంలోని దట్టమైన దండకారణ్యంలో అమర్చిన ఏడు బూబీ ట్రాప్‌లను ఆంధ్రా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా చింతూరు మండలం మల్లంపేటకు సమీపంలోనే ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతముంది. సరిహద్దుకు అవతల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని మైతా, దుర్‌మా, సింగారం వంటి మావోయిస్టు ప్రభావిత గ్రామాలున్నాయి. ఈ ప్రాంతం నుంచే మావోయిస్టులు ఇరు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు. దీంతో పోలీసులు సైతం ఇదే ప్రాంతంలో ప్రత్యేక బలగాలతో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తుంటారు. గతంలోనూ పోలీసులు, మావోయిస్టులకు నడుమ భారీ ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా, ఇరువైపులా భారీగా ప్రాణనష్టం సంభవించింది.

బూబీ ట్రాప్ అంటే...

రహదారిపై రెండు నుంచి ఐదడుగుల లోతున గోతులు తవ్వి వాటిలో సూదిగా ఉండే ఇనుప ముక్కలు లేదా సూదిగా ఉండే వెదురు కర్రలను అమర్చడాన్ని బూబీ ట్రాప్ అంటారు. నిత్యం కూంబింగ్‌కు వచ్చే పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు దండకారణ్యంలో బూబీ ట్రాప్‌లను అమర్చడం పరిపాటి. గతంలోనూ ఇదే ప్రాంతంలో మావోయిస్టులు వాటిని అమర్చిన ఘటనలున్నాయి. కూంబింగ్‌కు పోలీసులు అదే రహదారిలో వస్తారనే పక్కా సమాచారంతో మావోయిస్టులు పలుచోట్ల రహదారి పక్కనే గోతులను తీసి వాటిలో బూబీ ట్రాప్‌లను అమరుస్తారు. అనంతరం ఆ గోతులను కనబడకుండా చెత్తతో కప్పేస్తారు.

ఆదమరిచి అడుగేస్తే అంతే...

రహదారిపై మావోయిస్టులు మందుపాతర్లు అమర్చే అవకాశముండటంతో కూంబింగ్ నిర్వహించే పోలీసులు అధికశాతం రహదారి పక్కనే నడుస్తారు. అందుకే మావోయిస్టులు బూబీ ట్రాప్‌లను రహదారి పక్కనే అమరుస్తారు. అటుగా వచ్చిన వాటిని గమనించక ఆ గోతుల్లో పడితే వారి కాళ్లు, శరీరంలోకి సూదిగా ఉన్న బూబీ ట్రాప్‌లు గుచ్చుకుని తీవ్రమైన గాయాలు లేదా ప్రాణాలు పోయే అవకాశముంది. గతంలో బూబీ ట్రాప్‌ల వలలో చిక్కుకుని చాలా మంది పోలీసులకు గాయాలైన సంఘటనలున్నాయి.

ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే లక్ష్యంగా...

కొంతకాలంగా దండకారణ్యంలో మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరిస్తూ వస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా దండకారణ్యంలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహించే అవకాశముంది. దీంతో కూంబింగ్‌కు వచ్చే బలగాలకు నష్టం చేకూర్చాలనే వ్యూహంలో భాగంగా తాజాగా సరిహద్దుల్లో మావోయిస్టులు అమర్చిన ఏడు బూబీ ట్రాప్‌లను పక్కా సమాచారంతో ఆంధ్రా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల బూబీ ట్రాప్‌ల వ్యూహాన్ని ఆదిలోనే అడ్డుకోవడం ద్వారా కూంబింగ్ బలగాలకు పెనుప్రమాదం తప్పినట్లయిందని పోలీసులు తెలిపారు.

పట్టు సాధించేందుకే... : ఎస్పీ తుహిన్ సిన్హా

పోలీసులకు నష్టం చేకూర్చడం ద్వారా అటవీ ప్రాంతంలో తిరిగి పట్టు సాధించేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారని, దీనిలో భాగంగానే బూబీ ట్రాప్‌లను అమర్చారని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. బూబీ ట్రాప్‌లను అమర్చి పోలీసులను హతమార్చేందుకు మావోయిస్టులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, దీనివల్ల అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకూ నష్టం జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి తోడ్పడుతున్న పోలీసులు, అధికారులను అడ్డుకునేందుకే వారు ఇలాంటి చర్యలు చేపడుతున్నారన్నారు.

ఇదిగో బలం!

- వైఎస్సార్ సీపీకి పట్టం కట్టిన పల్లెలు
- జీర్ణించుకోలేకపోతున్న టీడీపీ, పచ్చ పత్రికలు
- ప్రజలను తప్పుదారి పట్టించేలా రాతలు
- ఉప ఎన్నికల్లో తమకే ఎక్కువ సీట్లొచ్చాయని తప్పుడు ప్రచారం

సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే పల్లెలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టారు. తాజాగా సర్పంచ్, వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ అదే రీతిలో తీర్పునిచ్చారు. అత్యధిక స్థానాలు అధికార వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లకే కట్టబెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకే జై కొట్టినట్టు మరోసారి నిరూపించారు. అయితే ఈ ఫలితాలను జీర్ణించుకోలేని తెలుగుదేశం, ఆ పార్టీకి కొమ్ముకాస్తున్న పచ్చ పత్రికలు ఈ ఉప ఎన్నికల్లో టీడీపీకే ఎక్కువ స్థానాలొచ్చాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించేలా రాతలు రాస్తున్నారు. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా పల్లెల్లో తాము మునుపటికంటే పుంజుకున్నట్టు జనాన్ని నమ్మించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను తమ ఖాతాలోనే నిస్సిగ్గుగా వేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. విశాఖపట్నం జిల్లాలో ఏకైక (భీమిలి మండలం లక్ష్మీపురం) సర్పంచ్ సహా మరో తొమ్మిది వార్డుల స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లే గెలుపొందారు. ఈ జిల్లాలో ఒక్క చోట కూడా టీడీపీ గాని, ఆ పార్టీకి మద్దతుగా నిలిచే బీజేపీ, జనసేనలు బలపరచిన అభ్యర్థులు గాని గెలవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక అనకాపల్లి జిల్లాలో 24 వార్డు స్థానాల్లో 16 వైఎస్సార్‌సీపీ, ఐదు టీడీపీ, మూడు ఇతరులకు దక్కాయి. ఈ జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకుగాను కొరుప్రోలు సర్పంచ్ స్థానాన్ని టీడీపీకి దక్కించుకుంది. బుచ్చయ్యపేటలో సర్పంచ్ (టీడీపీ) మరణించడంతో బరిలో నిలిచిన అతని భార్యపై సానుభూతితో వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీకి దింపలేదు. దీంతో అక్కడ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు సర్పంచ్ స్థానాల్లో మూడింటిని (రంపచోడవరం మండలం ఆకూరు, జీకేవీధి మండలం సీలేరు, పెదబయలు మండలం పెదకోడపల్లి) వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులే విజయం సాధించారు. హుకుంపేట మండలం శోభకోట సర్పంచ్ స్థానాన్ని మాత్రమే టీడీపీ మద్దతు అభ్యర్థి గెలవగలిగారు. వాస్తవ ఫలితాలు ఇలా ఉంటే టీడీపీ నేతలు మాత్రం కిందపడ్డా తమదే గెలుపంటూ అడ్డగోలు వాదనలకు దిగుతున్నారు. ఆ పార్టీ తోక పత్రికలు అవాస్తవాలు రాస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జనం వీరి రోత రాతలను చూసి విస్తుపోతున్నారు.

అల్లూరి జిల్లా ఉప ఎన్నికల వివరాలు

	మొత్తం	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	ఇతరులు
సర్పంచ్‌లు	4	3	1	0
వార్డులు	57	35	14	8



బట్టి చిట్టిబాబు, పెదకోడాపల్లి పంచాయతీ



పాంగి దుర్గో సీలేరు పంచాయతీ



కత్తుల సరస్వతి ఆకూరు పంచాయతీ



బూసిపుట్టులో ఏకగ్రీవమైన వార్డు మెంబర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

క్లుప్తంగా

ఎంపీ, ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్ దిగ్భ్రాంతి

పాడేరు రూరల్: పాడేరు ఘాట్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదంపై అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని వారు వేర్వేరుగా పరిశీలించారు. జిల్లా ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వైద్య చికిత్సలు పొందిన క్షతగాత్రులను పరామర్శించారు. ఘాట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటున్నామని వారు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసి మృతి


మృతిచెందిన కుమార్

చింతూరు: మండలంలోని చట్టి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన జారుపుల కుమార్(35) మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కుమార్ ఆన్‌లైన్ సంస్థలో పనిచేస్తున్నాడు. చింతూరు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో చట్టి వద్ద ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బొలేరో పికప్ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గుండె పోటుతో అంబులెన్స్ డ్రైవర్ మృతి


రాజారావు(ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న నీలాద్రి రాజారావు (61) ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్దనే గుండె పోటుతో మరణించారు. ఆయన ఐదేళ్లుగా జడ్డంగి పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. అందరికి సుపరిచుతుడైన రాజారావు మృతితో స్వగ్రామం చినరెల్లంగిపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బడుగులకు నాణ్యమైన విద్య జగనన్న ఘనతే

- రాష్ట్రంలో ఎస్సీ వర్గానికి పెద్దపీట
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు. చిత్రంలో బొడ్డేడ ప్రసాద్, లోచల సుజాత

అనకాపల్లిటౌన్: విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. విద్య మార్పుతో బడుగు, బలహీనవర్గాల నాణ్యత గల విద్య అందుతుంటే చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో అమలు చేస్తుంటే సహకరించాల్సింది పోయి ప్రభుత్వంపై బురదజల్లే ధోరణి అవలంభించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గానికి రాష్ట్రంలో పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డేనని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు ఎక్కడ తిరిగినా ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పేదల కోసం 32 లక్షల గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అరకిలోమీటర్ కూడా తిరగలేని పవన్ కళ్యాణ్‌కు ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి కాలినడకన రాష్ట్రమంతా తిరిగి ప్రజల కష్టాలను కళ్లారా చూసి సీఎంగా గెలిచిన తర్వాత సంక్షేమాభివృద్ధి అంటే ఇలా ఉంటుందని చేసి చూపారని తెలిపారు. దళితదండు అంతా జగన్ వెంటే ఉంటూ, ఆయన గెలుపుకోసం పాడుతామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసింది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దళితవర్గానికి ఒక ఉప ముఖ్యమంత్రి, నలుగురు ఎమ్మెల్యే పదవులు కేటాయించడమే ఉదాహరణగా అభివర్ణించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని మేజర్ పంచాయతీలు ఎస్సీ వర్గానికి కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన పంచాయతీల్లో 64 పంచాయతీలకుగాను 53 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి 70 లక్షల జనాభాగల ఎస్సీ వర్గానికి రూ.53.66 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేసింది జగన్ ప్రభుత్వమేనని అన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి జూపూడి ప్రభాకరరావు, బొడ్డేడ ప్రసాద్, లోచల సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జోన్ ఇన్‌ఛార్జి అల్లంపల్లి రాజుబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సరేష్, ఎస్సీసెల్ జిల్లా నాయకులు జామి రాజు, వడ్డాది అశోక్, మందా రాము, అమ్మాజీ, కె.పద్మ, మూనూరు శ్రీనివాసరావు, డీవీ.నర్సింహారావు, సంపంగి కనకరావు, బెల్లాన అనురాధ, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, సప్పారపు లక్ష్మీప్రసన్న పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పాల్గొన్నారు.

సేఫ్టీ కోర్సుతో విస్తృత ఉపాధి అవకాశాలు


జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ రెడ్డితో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

మురళీనగర్ : సేఫ్టీ కోర్సులు అభ్యసించిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ రెడ్డి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల స్నాతకోత్సవాన్ని నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలను విధుల్లో పాటించాలన్నారు. భద్రతా కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్స్‌తోపాటు కెమికల్ సూపర్‌వైజర్ కోర్స్ ప్రారంభించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో దువ్వాడ ఆర్‌ఐఎన్‌ఎల్ జీఎం రాం ప్రసాద్, ఈఐపీఎల్ సీనియర్ జీఎం కేవీకే సుబ్బరాజు, హెచ్‌పీసీఎల్ ఫైర్ సేఫ్టీ విభాగం జీఎం ఎస్‌సీ పంజా, కోరమాండల్ ఇంటర్నేషనల్ ఏజీఎం నాగరాజు దేవరపల్లి, గైస్ హెచ్‌వోడీ బీవీ లక్ష్మణరావు, కోర్స్ కో ఆర్డినేటర్ వరహాలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం బూడి పరామర్శ


మహేష్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, పక్కన ఎంపీ మాధవి

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలో విశ్రాంతి తీసుకుంటున్న అరకు ఎంపీ మాధవి సోదరుడు, అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌ను ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని మహేష్‌కు సూచించారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీ మాధవి ఉన్నారు.

వానలు కురవాలని గ్రామాల్లో పూజలు


పూజకు సిద్ధంగా ఉంచిన పసుపునీటి బిందెలు

రాజవొమ్మంగి: వర్షాభావ పరిస్థితులకు రైతులు తీవ్ర ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటోంది. దీంతో వానలు కురవాలి, సాగు ముందుకు సాగాలని కోరుకొంటూ మండలంలోని పలు గ్రామాల్లో గంగాలమ్మ తల్లిని తలచుకొంటూ ఆదివారం గిరిజన రైతులు, మహిళలు ప్రతి ఆలయానికి వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. దూసరపాము గ్రామంలో 101 కడవలతో పూలు, పసుపు కలిపిన నీటిని డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొని వెళ్లి అమ్మవారి గుడి ప్రాంగణంలో జల్లారు. అనంతరం పసుపు కుంకుమలు, దీపధూప నేవేద్యాలతో పూజలు చేశారు. సర్పంచ్ చీడి శివ, గ్రామస్తులు తోలాటి బుజ్జి, మంతెన ముసలయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. లాగారాయి గ్రామంలో సర్పంచ్ మిరియాల గణలక్ష్మి, స్థానిక నాయకుడు బొడ్డు వెంకటరమణ, యువకుల ఆధ్వర్యంలో గంగాలమ్మ పండుగ జరిగింది. కార్యక్రమాల్లో భాగంగా ఉపవాసం ఉన్న బాలుర్ల చేత కప్పలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం సమీపంలోని కొండ వాగు వద్ద పూజలు చేసి కప్పలను నీటిలో వదిలి పెట్టారు. ముర్లవానిపాలెంలో గిరిజనులు వర్షాల కోసం పలు ఆలయాల్లో పూజలు చేశారు.

సుదూరం వెళ్లి లబ్ధిదారు ఈకేవైసీ నమోదు


కాకినాడ జీజీహెచ్‌లో వరలక్ష్మి నుంచి ఈకేవైసీ నమోదు చేస్తున్న గ్రామ వలంటీర్ ప్రశాంత్

అడ్డతీగల: అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారు సంక్షేమ పథకం లబ్ధి పొందకుండా ఉండరాదనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా గ్రామ వలంటీర్లు నిబద్ధతతో పనిచేస్తున్నారు. తాజాగా అడ్డతీగల మండలం గొంటువానిపాలేనికి చెందిన గండే సూర్య చక్ర వరలక్ష్మి తన భర్తకు అనారోగ్యంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో చేర్పించింది. అక్కడ కొద్ది రోజులుగా వైద్య సేవలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కాపునేస్తం పథకానికి ఈమె అర్హురాలు కావడంతో గ్రామ వలంటీర్ పల్లాల ప్రశాంత్ 85 కిలోమీటర్ల మేర ప్రయాణించి ఆదివారం అక్కడకు వెళ్లారు. బయోమెట్రిక్ ద్వారా ఆమె వేలిముద్ర తీసుకుని ఈకేవైసీ నమోదు చేశారు. సంక్షేమ పథకం పొందడానికి అర్హులైతే.. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఉన్న వారికైనా వాటి ఫలాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్టయింది.

తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై కారును ఢీకొన్న బైక్

- యువతికి తీవ్రగాయాలు


ప్రమాదంలో ఊడిపడిన బైక్ ముందు చక్రం

అల్లిపురం: తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై ఆదివారం కారు, బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఆమెను అటుగా వెళుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి తన వాహనంలో మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో ఏపీ 39 ఏపీ 4713 పల్సర్ బైక్‌పై ఒక యువకుడు, యువతి కలసి సంపత్ వినాయక గుడి వైపు నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళుతున్నారు. రైల్వే హాస్పటల్ దరికి చేరుకునే సమయంలో ఏపీ 31డీడీ 2987 బెలోనో కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో బైక్ ఫ్రెంట్ వీల్ ఊడిపోయింది. బైక్ వెనుక కూర్చున్న యువతి కింద పడడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. అటువైపు వెళుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి తక్షణమే స్పందించి క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి చేర్పించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మీ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక

మహారాణిపేట: సీఆర్ మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆదివారం విశాఖ చేరుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న 'సుపరిపాలన దిశగా ఏపీ' కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. నగరానికి విచ్చేసిన కొమ్మినేనికి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ వద్ద సమాచార పౌర సంబంధాల శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ మల్లికార్జునరావు, ఎ.వెంకటరావు తదితరులు స్వాగతం పలికారు.

ప్రకృతి సాగుపై అవగాహన

- సేంద్రియ కషాయాల తయారీపై శిక్షణ
- పొలాల్లో చిరుధాన్యాల విత్తనాల నాట్లు


రాజవొమ్మంగిలో కషాయం తయారీని రైతులకు వివరిస్తున్న ఎంసీఆర్పీ అప్పలరాజు


దద్దిలికివాడలో రైతులతో వివిధ పంటల ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది


భీరం గ్రామంలో రైతులకు మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రసాద్, రామలింగం


వై.రామవరం: మండలంలోని చామగడ్డ సచివాలయం పరిధిలోని దద్దిలికివాడ గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఒకే భూమిలో పలు పంటలు వేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. సేంద్రియ ఎరువులు తయారీపై రైతులకు శిక్షణ, అవగాహన కల్పించారు. ఆ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఓ రైతుకు చెందిన భూమిలో పలు పంటల విత్తనాలు వేసి పండించే విధానంపై ప్రయోగాలు చేయించారు. సుమారు 10 రకాల చిరుధాన్యాల విత్తనాలను బెడ్‌లు తయారు చేయించి వేయించారు. దీనికి సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తామన్నారు. దీనివలన పలురకాల పంటలను ఒకే భూమిలో పండించి అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది జయరామప్ప, జె.రత్నం, కె.మాణిక్యాలరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురం పరిధిలోని లోదొడ్డిలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం వద్ద పలు కషాయాల గురించి రైతులకు వివరించారు. దశపర్ణి కషాయం తయారు చేసి దాని ఉపయోగాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మండల సీఆర్పీ అప్పలరాజు మాట్లాడుతూ సేంద్రియ కషాయాలతో పంటలకు తెగుళ్ల సోకకుండా ఉంటాయన్నారు. 200 లీటర్ల నీరు, 20 లీటర్ల గోమూత్రం, 2 కిలోల దేశీయ గోవు పేడ, 500 గ్రాముల పసుపు, 500 గ్రాముల అల్లం, 10 గ్రాముల ఇంగువ, పొగాకు ఒక కిలో, పచ్చిమిర్చి కిలో, 500 గ్రాముల వెల్లుల్లి పచ్చడి, పరిసరాల్లో లభించే 10 రకాల ఆకులతో ఈ దశ పర్ణి కషాయం తయారీని వివరించారు. 40 రోజుల తరువాత ఈ కషాయాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. 3 లీటర్ల కషాయాన్ని వంద లీటర్ల నీటితో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కషాయం వల్ల రసం పీల్చు పురుగులు, గొంగళి పురుగులను నివారించుకోవచ్చన్నారు. పలు రకాల శిలీంద్ర తెగుళ్ళు రావన్నారు. దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, శ్రీను, నూకరత్నం, మంగ, మల్లేశ్వరి, రైతులులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో గ్రోత్ ప్రమోటర్ కోసం మీనామృతం తయారీపై గిరిజన రైతులకు అవగాహన పెంపొందించుకోవాలని రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు, భీరం యూనిట్ ఇన్‌చార్జీలు రామలింగం, ఎం.ప్రసాద్ తెలిపారు. మండలంలో నుర్మతి, భీరం పంచాయతీ కేంద్రాల్లో గిరిజన రైతులకు ఆదివారం మీనామృతం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సముపాలలో చేప వ్యర్థాలు, బెల్లం తీసుకొని 15 రోజులు మురగబెట్టి తరువాత తగినంత నీరు కలుపుకొని పిచికారీ చేయాలని , ఇలా చేస్తే మొక్క ఎదుగుదల బాగుంటుందని వివరించారు. ప్రకృతిలో లభించే ఆకులు, ఆవు మూత్రంతో కషాయాల తయారీ చేసి పిచికారి చేస్తే చీడపీడలను నివారించవచ్చన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ప్రకృతి సేంద్రియ ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. ఐసీఆర్పీలు కాంతమ్మ, సింహచలం, రాజుపడాల్,రాజీబేగం రైతులు పాల్గొన్నారు.

లయన్స్ పంజా

వైజాగ్ వారియర్స్‌పై భారీ విజయం


ఓపెనర్‌గా లయన్స్ భరత్


అర్ధసెంచరీ భాగస్వామ్యం అందించిన రాహుల్-తపస్వి జోడి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ 93 పరుగుల భారీ తేడాతో వైజాగ్ వారియర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి వైజాగ్ వారియర్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరాంధ్ర లయన్స్ ఆరు వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక స్కోర్. ఓపెనర్లు గుల్ఫామ్(13), కెప్టెన్ భరత్ 45(3X4, 4X6) 67 పరుగులకే పెవిలియన్ చేరినా.. టాప్ ఆర్డర్ చెలరేగిపోయారు. రాహుల్ 36 బంతుల్లో 54(3X4, 3X6), శ్యాంసుందర్(20), తపస్వి 23 బంతుల్లో 38(4X4, 2X6)తో స్కోర్‌ను 205 పరుగులకు చేర్చారు. శ్రీనివాస్ అజేయంగా 13 బంతుల్లోనే ఒక ఫోర్, నాలుగు సిక్సర్లతో 33 పరుగులు రాబట్టాడు. వర్మ రెండు వికెట్లు తీయగా గిరీష్‌కుమార్, సిద్ధార్థ, వేణు ఒక్కో వికెట్ తీశారు. ప్రతిగా భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వైజాగ్ వారియర్స్ 113 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ అర్జున్ ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 29 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో ఓపెనర్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ 8 పరుగులకే అయ్యప్ప బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు దొరికిపోయాడు. ప్రశాంత్ మూడు ఫోర్లు ఒక సిక్సర్‌తో కాసేపు మెరిపించగా 28 పరుగులతో వాసు బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. కరణ్(13) తేజస్వికి దొరికిపోయాడు. మిగతా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. దీంతో 14.4 ఓవర్లలోనే వైజాగ్ వారియర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. తపస్వి, పృథ్వీ మూడేసి వికెట్లు తీయగా వాసు రెండు, అయ్యప్ప ఒక వికెట్ పడగొట్టాడు.

తడబడ్డ టైటాన్స్ : తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయకేతనం ఎగురవేసిన గోదావరి టైటాన్స్ మూడో మ్యాచ్‌లో కాస్త తడబడింది. రాయలసీమ కింగ్స్ చేతిలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ తొమ్మిది వికెట్లకు 150 పరుగులు చేసింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్(3)తో సహా వంశీ(9),హనుమంత్(3),సందీప్(7)మనీష్(5) టాప్ ఆర్డర్ కూలడంతో 40 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. టాప్ మిడిలార్డర్‌లో పాండురంగ రాజు(23)ధీరజ్(20) కాస్త నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా 78 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. లోయర్ మిడిలార్డర్‌లో విజయ్ ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేసినా మరో ఎండ్‌లో సమన్విత్(11) మినహా సహకారం కరవైంది. విజయ్(63పరుగులు, 24బంతుల్లో ఆరు ఫోర్లు, ఐదు సిక్సర్లు) అర్ధసెంచరీ చేశాడు. హరిశంకర్ మూడు వికెట్లు తీయగా గిరినాథ్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా 151పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ కింగ్స్ 17.4ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. కెప్టెన్ హనుమ విహారీ(21పరుగులు)కి మరో ఓపెనర్ అభిషేక్ (53పరుగులు) తోడై నిలకడగానే ఆడుతూ బలమైన పునాది వేశారు. వంశీకృష్ణ (మూడు ఫోర్లు, ఒక సిక్సర్) 39 పరుగులతో అజేయంగా నిలిచాడు. మాధవ్ వేసిన బంతిని వంశీకృష్ణ ఫైన్‌లెగ్‌లో బౌండరీకి తరలించడంతో కింగ్స్ ఐదు వికెట్లకు 153 పరుగులతో విజయం సాధించింది. ఇస్మాయిల్ మూడు వికెట్లు తీయగా మాధవ్, విజయ్ చెరో వికెట్ తీశారు.